


# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



## సరికొత్త బొమ్మలండీ!

రవీంద్రనాథ టాగోర్

నొతున్ పుతుళ్ (బెంగాలీ,1922)




ఒకానొకప్పుడు ఒక పేరుమోసిన 'పుతుళ్ నిర్మాత', బొమ్మల తయారుచేసే కళాకారుడు, ఉండేవాడు. అతను అమ్మాయిలు ఆడుకొనే బొమ్మలు తయారుచేయడంలో ఆరితేరిన కళాకారుడు. రాజకుటుంబాలలోని అమ్మాయిలు అతని బొమ్మలతో ఆడుకోవడానికి ఎంతో ఇష్టపడే వారు. రాజుగారి కోటలో ప్రతి ఏడాది, ఒక బ్రహ్మాండమైన బొమ్మల కళాప్రదర్షన జరిగేది. అక్కడికి ఎక్కడెక్కడి నుంచో బొమ్మల కళాకారులు వచ్చేవారు. ఎందరు వచ్చినా, అందరిలోను అతనే మిన్న అని ప్రతిఒక్కరూ అనుకొనే వారు. అందరికీ అతనంటే ఎనలేని అభిమానం. ఆ కళాప్రదర్షన ముగిసేనాడు, కళాకారులంతా కలిసి, అతనిని ఎంతో గౌరవంతో సత్కరించేవారు. అలా వారు బొమ్మల కళాకారులందరిలో అతనిని ఉన్నతస్థానంలో నిలుపుకొన్నారు.

అతనికి ఎనభై ఏళ్ళ వయస్సు వచ్చేసింది.

సరిగ్గా అప్పుడే, ఒక యువకళాకారుడు బొమ్మలతయారీలోకి అడుగు పెట్టాడు. అతని పేరు కిషన్ లాల్.

కిషన్ లాల్ కొన్ని బొమ్మలను పూర్తి చేసేవాడు. మరికొన్నిటిని అసంపూర్తి గా వదిలేసేవాడు. కొన్ని బొమ్మలకు రంగులు వేసేవాడు. కొన్నిటికి ఏ రంగులు వేసేవాడు కాడు. వాటిని చూసేవారికి అనిపించేది, "ఇక ఈ బొమ్మలను ఎప్పటికీ పూర్తిచేయడేమో" అని. నిజంగానే, కొన్ని బొమ్మలను ఎన్నటికీ పూర్తిచేసే వాడు కాడు.

"అబ్బ, చూడండి కిషన్ లాల్ ఎంత ధైర్యవంతుడో!" అనే వారు యువతరం.

"దానిని ధైర్యం అంటారా? అది బొమ్మలతయారీ కళకు అగౌరవం! అవమానం!" అనే వారు పెద్దవాళ్ళు.

ఏది ఏమైనా, కొత్తతరం అంటే కొత్త అవసరాలు. ఈ తరం రాజకుమారీలు, "మాకు ఈ అరకొరగా చేసిన బొమ్మలే కావాలి" అని పట్టుబడుతున్నారు.

"అరరే! చూడండి ఈ తరం పిల్లల అభిరుచి ఎంతగా దిగజారిపోయిందో!" అని వాపోయేవారు పాతతరం వారు.

ఈ మాటలు కిషన్ లాల్ చెవిన పడ్డాయి. కిషన్ లాల్ మరింత శ్రద్ధగా బొమ్మలను తయారుచేయసాగాడు.

ఆ ఏడాది ఆ వృద్ధ కళాకారుని అంగడి వద్ద బొమ్మలు కొనేవారు ఎవరూ లేరు. అంగడి లోపలికి వచ్చి బొమ్మలను చూసిన వారూ లేరు. బుట్టల్లో ఎదురు చూస్తున్న బొమ్మలు, రేవులో నావ కోసం ఎదురుచూసే ప్రయాణీకుల్లా ఉన్నాయి.

మరో ఏడాది గడిచిపోయింది. ఆ తరువాత, మరో రెండేళ్ళు గడిచాయి.

ప్రతి ఒక్కరూ ఆ వృద్ధుని పేరే మరిచిపోయారు.

బొమ్మల ప్రదర్షనలో, కిషన్ లాల్ ప్రధాన బొమ్మలకళాకారుడిగా పరిణమించాడు. గొప్ప గుర్తింపును, గౌరవాన్ని పొందాడు.

ఆ వృద్ధ కళాకారుడికి మనసు విరిగిపోయింది. చూస్తుండగానే, అతని చేతిలో పని లేకుండాపోయింది.

అతని కూతురు ఒకరోజు అతని దగ్గరకు వచ్చి, అంది. "నాన్నా, నువ్వు వచ్చి మా దగ్గర ఉండు."

అతని అల్లుడు అన్నాడు, "మామయ్యా, కోరినవన్నీ తినండి. హాయిగా విశ్రాంతి తీసుకోండి.

పశువులు చొరబడకుండా, కూరగాయల తోట మీద కాస్త కన్నేసి ఉంచండి. అంతే."

వృద్ధుడి కూతురికి ఇంటి పనితో తీరిక ఉండేది కాదు. అల్లుడేమో, మట్టితో ప్రమిదలు, దీపాలు చేసేవాడు. వాటిని పట్నం తీసుకు వెళ్ళి, అమ్ముకు వచ్చే పనిలో నిమగ్నమై ఉండేవాడు.

ఆ వృద్ధుడు కాలంతో వచ్చే మార్పులు ఎలా గుర్తించలేదో, అలాగే అతని మనవరాలు పదహారేళ్ళ అమ్మాయి అయిందనీ గమనించలేదు.

అతను రోజూ ఒక చెట్టు కింద కూర్చుని, కూరగాయల తోటను కాపాలా కాస్తూ ఉండేవాడు.

అప్పుడు అతని మనవరాలు, వెనకనుండి చప్పుడు చేయకుండా వచ్చి, అతని మెడ చుట్టూ చేతులు వేసేది. గారాలు పోయేది. ఈ మనవరాలి గారాబం అతనికి ఎంతో సంతోషంగా ఉండేది.

"ఏంటమ్మా తాతమ్మా, ఏం కావాలి నీకు?" మురిపెంగా అడిగే వాడు.

"నాకు ఒక బొమ్మ చేసి ఇవ్వు తాతయ్యా, ఆడుకొంటాను," అనేది మనవరాలు.

"ఇపుడు ఎందుకమ్మా ఆ బొమ్మలు?" ఆ వృద్ధుడు అడిగేవాడు.

"తాతయ్యా, నీకన్నా గొప్పగా బొమ్మలు ఎవరైనా తయారు చేయగలరా, చెప్పు?" ఆ అమ్మాయి అనేది.

"ఎందుకు చేయరు? కిషన్ లాల్ చేస్తాడు!" ఆ వృద్ధుడు బదులు ఇచ్చేవాడు.

"ఆ అవకాశమే లేదు, తాతయ్యా, లేనే లేదు!" ఆ అమ్మాయి టక్కున అనేది.

ఇదే సంభాషణ వాళ్ళిద్దరి మధ్యన చాలాసార్లు జరిగింది.

చివరికి ఒక రోజు, ఆ వృద్ధుడు మూటలోంచి తన బొమ్మలు తయారు చేసే సామాగ్రిని బయటకు తీశాడు.

గుండ్రని, దళసరి కళ్ళద్దాలు ముఖానికి తగిలించుకొన్నాడు.

"కానీ తాతమ్మా, మొక్కజొన్న కంకులను కాకులు తినేస్తాయిగా!" అని మనవరాలితో అన్నాడు.

"తాతయ్య, కాకుల్ని నేను తోలేస్తాలే!" మనవరాలు భరోసా ఇచ్చింది.

రోజులు ఇలా గడిచిపోతున్నాయి.

దూరంగా ఎద్దులు నీరు తోడిపోస్తున్న శబ్దం వినిపిస్తోంది.

ఆ అమ్మాయి కాకుల్ని తోలుతూ ఉండేది.

తాత బొమ్మలు చేస్తూ ఉండేవాడు.

•

తాతకి తన కూతురు అంటే ఎక్కడ లేని భయం. ఆమె చాలా ఖచ్చితమైన మనిషి. కుటుంబంలో అందరూ ఆమె మాటను తు. చ. తప్పకుండా పాటించేవారు.

ఆ రోజు ఎప్పటిలాగే బొమ్మలు చేస్తున్న తాత, తన పనిలో తాను మునిగిపోయాడు. కూతురు వెనక నుంచి చేతులు తిప్పుకొంటూ రావడాన్ని, గమనించలేదు.

"నాన్నా!" ఆమె బిగ్గరగా పిలిచేసరికి, కళ్ళద్దాలు గబుక్కున తీసేసాడు. ఒక అమాయకపు పిల్లవాడిలా ముఖం పెట్టుకొని కూర్చున్నాడు.

"ఇంకా ఆవుకి పాలు పిండలేదు. నువ్వేమో, ఇక్కడ సుభద్రతో చేరి, ఊరికినే కాలక్షేపం చేస్తున్నావు. అసలు ఇది సుభద్ర బొమ్మలతో ఆడుకొనే వయసేనా?" ఆమె గద్దించింది.

తాత నీళ్ళు నమిలాడు. మెల్లిగా అన్నాడు, "వీటితో సుభద్ర ఎందుకు ఆడుకొంటుంది? నేను ఈ బొమ్మలను రాచనగరుకి తీసుకువెళ్ళి, అమ్ముకు వస్తాను. తాతమ్మ పెళ్ళినాటికి, ఒక బంగారు కాసులపేరు తయారవుతుంది. దానికోసమే, డబ్బు పొదుపు చేస్తున్నా."

అతని మాటలకు అతని కూతురికి వళ్లు మండిపోయింది.

"రాజు కోటలోకి వెళ్ళి అమ్మితే, ఈ పాతకాలం బొమ్మలు ఎవరు కొంటారంటా?" టకామని అడిగింది.

తాత సిగ్గుతో తల దించుకొన్నాడు. నోట్లో మాట రానట్టు, కూర్చుండిపోయాడు.

•

రెండురోజుల తరువాత, సుభద్ర ఒక బంగారు కాసును తెచ్చి తల్లికి ఇచ్చింది.

"ఇదుగో అమ్మా, ఈ మొహరీ తీసుకో. తాతయ్య బొమ్మ విలువ అది."

"ఈ మొహరీ ఎక్కడ నుంచి వచ్చింది నీకు?" తల్లి ఆరాతీసింది.

"రాజనగరం లో నేను తాతయ్య చేసిన బొమ్మను అమ్మాను," సుభద్ర చెప్పింది.

తాత గిలిగింతలు పెట్టినట్లు నవ్వాడు.

"తాతమ్మా, మీ తాత కళ్ళు కాస్త కనబడి వుంటే, చేతులు ఇంకొంచం వణకక పోయి ఉంటే, ఇట్టే అమ్ముడు బోయేది కదా..!"

తల్లి ముఖం వికసించింది.

"ఇలాంటి పదహారు కాసులు మన దగ్గర ఉంటే, సుభద్రకు పెళ్ళి చేసేయవచ్చు," ఆమె అంది.

"అయితే, దిగులు పడొద్దులే!" తాత భరోసా ఇచ్చేసాడు.

సుభద్ర తాతతో అంది, "తాతయ్యా, నాకోసం పెళ్ళికొడుకును వెతికే శ్రమ పడవద్దులే!"

తాత నవ్వడం మొదలుపెట్టాడు. కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లేలాగా.

తాతకు ఎక్కడలేని హుషారు వచ్చింది. నవయువకుడిలా శక్తిని పుంజుకొన్నాడు.

చెట్టు కింద కూర్చుని తాత బొమ్మలు చేసేవాడు. సుభద్ర కాకులు తోలేది.

దూరం నుంచి ఎడ్లు నీటిని తోడడం వినిపించేది.

చూస్తుండగానే, ఒక దాని తరువాత ఒకటి పదహారు కాసులు ఇంటికి వచ్చేసాయి.

వాటిని చక్కటి అందమైన హారంలా తీర్చి దిద్దారు.

"కాసులపేరు తయారు. ఒక్క పెళ్ళి కొడుకు లేడు అంతే!" తల్లి అంది.

"తాతయ్యా, నా పెళ్ళి కొడుకు సిద్ధంగా ఉన్నాడు!" సుభద్ర తాత చెవిలో రహస్యంగా గుసగుసలాడింది.

"తాతమ్మా, చెప్పమ్మా! ఎక్కడ దొరికాడు నీకు నీ పెళ్ళికొడుకు?"

సుభద్ర నెమ్మదిగా చెప్పింది.

"మొదటి సారి బొమ్మలు అమ్మడానికి రాజనగరానికి వెళ్ళినప్పుడు, రాజ భటులు నన్ను కోటగుమ్మం దగ్గరే ఆపేసారు.

"ఏం కావాలి? ఎందుకు వచ్చావ్?" అని నిలదీసి ప్రశ్నలు వేసారు.

"కోటలోని రాజ కుమారీలకు బొమ్మలు అమ్మడానికి వచ్చాను," అని వారికి చెప్పాను.

"ఇప్పుడు ఈ పాతకాలం బొమ్మలు అమ్ముడు పోవు. వెళ్ళు! వెళ్ళు!" అని నన్ను తరిమేశారు.

నేను ఏడుస్తూ కూర్చున్నాను. అప్పుడు ఒక వ్యక్తి నా దగ్గరికి వచ్చాడు. "నీ బొమ్మలు ఇలా ఇస్తావా? కొంచం ఆ దుస్తులను, అలంకరణను మారిస్తే, బాగా అమ్ముడు పోతాయి," అన్నాడు. అలాగే అమ్ముడుపోయాయి.

తాతయ్యా, ఆ వ్యక్తి నీకు కూడా నచ్చితే, అతని మెడలో సంతోషంగా వరమాల వేస్తాను." అని అంది సుభద్ర.

"అతను ఎక్కడుంటాడు?" తాత అడిగాడు.

"అదుగో, ఆ పియాల్ చెట్టు కింద!" మనవరాలు చూపించింది.

ఆ కాబోయే పెళ్ళికొడుకు, చెట్టు నీడనుంచి వెలుగులోకి అడుగు పెట్టీపెట్టగానే, తాత అన్నాడు.

"అరే! ఇతను కిషన్ లాల్!"

అతను తాత పాదాలు తాకి నమస్కరించి అన్నాడు, "అవును! నేనే కిషన్ లాల్ ను."

తాత అతనిని ఆలింగనం చేసుకొని అన్నాడు.

"బాబూ, ఆ రోజు నేను చేసిన బొమ్మలు నా చేతినుంచి లాక్కెళ్ళావు. ఈ రోజు మా ఇంటి పుత్తడిబొమ్మను తీసుకెళ్ళి పోతున్నావు!"

మనవరాలు సుభద్ర తాత భుజాల చుట్టూ చేతులు వేసి అంది.

"నాతో పాటూ నిన్నూ తీసుకెళతానుగా, తాతయ్యా!"

★★★

పియాల్ చెట్టు : సార చెట్టు (buchanania lanzan)

**అనుసృజకుల వ్యాఖ్యానం**

కాలంతో పాటు వచ్చే మార్పులను గుర్తించవలసిన అవసరం ఎందుకు ఉన్నదో, ఈ కథ సున్నితంగా తెలియజేస్తుంది. కాలానుగుణంగా పరిణమించే ఆ సహజమార్పులలోని ప్రతిభను అంగీకరించవలసిన సందర్భాన్ని ఈ "**సరికొత్త బొమ్మలండి !**" కథ కలిగిస్తుంది. . కళాకారుడి ప్రతిభ కాలాలకు అతీతం అని స్పష్టపరుస్తుంది.

ఈ కథకు మూలసూత్రం తాతా మనవరాళ్ళ ఆత్మీయబంధం. ఒకనాటి గొప్పకళాకారుడిని పునరుజ్జీవింప గలిగేంత శక్తి ఆ అభిమానానికి ఉందని, ఈ "సరికొత్త బొమ్మలండి !" (నొతున్ పుతుళ్, బెంగాలీ, 1922) కథలో అందంగా ప్రకటిస్తారు ఠాగూర్. కుటుంబంలోని వృద్ధుల పట్ల, కుటుంబసభ్యుల దృక్పథాన్ని నాజూకుగా చూపిస్తారు.

COMMENTS